



కేంద్ర ఎన్నికల కమిషన్ సమావేశానికి
కలెక్టర్, ఎస్పీ

విజయవాడలో మంగళవారం నిర్వహించిన కేంద్ర ఎన్నికల కమిషన్ సభ్యుల సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్..



కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆందోళనకారులు

అఖిలపక్షం
జైల్‌భరో

కాకినాడ సిటీ, జనవరి 9: అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు, మున్సిపల్ కార్మికుల డిమాండ్లు తక్షణం పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జైల్ భరో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఇంద్రపాలెం వంతెన అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసులకు, అఖిలపక్షం నాయకులకు మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా సమస్యలైనా పరిష్కరించండి, జైలులోనైనా పెట్టండని నినా దాలు చేశారు. అఖిలపక్షం నాయకులకు అరెస్టు చేసి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. తొలుత సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జి, టీఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయి బాబు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ నరాల శివ మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించకపోతే గతంలో ఎస్మా ప్రయోగించిన ముఖ్యమంత్రులకు పట్టిన గతే జగన్‌కు పడుతుందని హెచ్చరించారు. సీఐ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నాయకులు మలకా రమణ, నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, చెక్క రమణి, కూరాకుల సింహాచలం, కే ఎస్ శ్రీనివాస్, పలివెల వీరబాబు, రొంగల ఈశ్వరరావు, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 9: అంగన్‌వాడీల సమ్మెపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం ఇప్పుడు వారిని భయపెట్టడానికి మరో అస్త్రాన్ని సిద్ధం చేసింది. ఎస్మా ప్రయోగం నేపథ్యంలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు వెంటనే విధులకు హాజరుకావాలని నోటీసులు జారీ చేయనుంది. 29 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తూ ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా బుధవారం నుంచి సమ్మెలో పాల్గొన్న వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయనుంది. సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని ఇప్పటికే ఐసీడీఎస్ పీడీ ప్రవీణ సిబ్బందిని ఆదేశించారు. అయినా అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సెంటర్స్ వద్ద, ఇళ్ల వద్ద నోటీసులు అంటించనున్నట్లు తెలుస్తోంది. నోటీసులు ఇచ్చినా పోస్టల్‌లో పంపినా తీసుకోవద్దని నాయకులు సమాచారం ఇవ్వడంతో అధికారులు సెంటర్స్ వద్ద, ఇళ్ల వద్ద నోటీసులు అంటించనున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో నోటీసులు అందించినట్లు సమాచారం. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా భయపడేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.



- నేడు తునిలో చంద్రబాబు 'రా..కదలిరా' బహిరంగ సభ
- మధ్యాహ్నం 3.30 గంటలకు బొబ్బిలి నుంచి హెలికాప్టర్‌లో రాక
- చామవరం ప్రాంతంలో యాభై వేల మందితో సభ
- సాయంత్రం ఆరు గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి పయనం
- ఫిబ్రవరి, సెప్టెంబరు తర్వాత చంద్రబాబు మళ్లీ ఇప్పుడు రాక
- వైసీపీ పాలనలో అక్రమాలు,అరాచకాలు, వైఫల్యాలపై ధ్వజమెత్తనున్న టీడీపీ అధినేత
- చంద్రబాబు రాకతో జిల్లా టీడీపీ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం
- గత నెలలో లోకేశ్ యువగళం, ఇటీవల పవన్, ఇప్పుడు చంద్రబాబు రాకతో వైసీపీలో వణుకు

తుని శివారు చామవరంలో బహిరంగ సభ ప్రదేశం



చంద్రబాబు వస్తున్నారు
రా..కదలిరా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నేడు తునికి రానున్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు చామవరం రోడ్డులో రా..కదలిరా పేరుతో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో పాల్గొన నున్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలపై రా..కదలిరా..పేరుతో ఎలుగెత్తనున్నారు. ఈ మేరకు అధినేత పర్యటనకు జిల్లా టీడీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. తుని జాతీయ రహదారి సమీపంలో చామవరం వద్ద నిర్వహిస్తున్న సభకు యాభైవేల మందికి పైగా పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కాగా చంద్రబాబు సభకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి వేలాది మందితో ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు తరలి రానున్నారు. వీరందరికి సభా ప్రాంగణంలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కాగా చంద్రబాబు సభ నేపథ్యంలో జిల్లా వైసీపీలో వణుకు పుడుతోంది. ఇప్పటికే లోకేశ్ యువగళం పాద యాత్ర, ఆ తర్వాత ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్ కాకినాడలో మకాం వేసి వరుస సమీక్షలు చేయడం, ఇప్పుడు చంద్రబాబు వస్తుండడంతో అధికార వైసీపీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒకపక్క టిక్కెట్ల లొల్లితో నియోజకవర్గాల్లో పార్టీ రెండు ముక్కలై సంక్షోభంతో అల్లాడుతుంటే, అటు టీడీపీ బలం పుంజుకుని దూసుకుపోతుండడంతో వైసీపీకి వణుకు పుడుతోంది.

దూసుకుపోవడమే..

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు కొద్ది రోజుల్లో రానున్నాయి. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఈ తరుణంలో చంద్రబాబు తునిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తుండడంతో ఎన్నికల కాక మరింత పెరిగింది. అటు బాబు రాకతో జిల్లా టీడీపీకి సైతం మరింత బలాన్ని ఇవ్వనుంది. గత నెలలో జిల్లాలో లోకేశ్ యువగళం పాదయాత్ర జరగ్గా, జనం జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ పోటెత్తారు. లోకేశ్‌తో పాటు నడిచి జన ప్రభంజనం సృష్టించారు. ఇది కాస్తా టీడీపీ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం నింపింది. చంద్రబాబును అక్రమంగా స్కిల్ కేసులో వైసీపీ ప్రభుత్వం గతేడాది జైలుకు పంపడంతో పాదయాత్ర తాత్కాలికంగా ఆగిపోయింది. తండ్రి కోసం న్యాయ పోరాటం చేయడం కోసం లోకేశ్ అటు ఢిల్లీకి వెళ్లడం, ఇటు సెంట్రల్ జైలు వద్ద ములాఖత్‌లకు హాజరవడం, చంద్రబాబుకు సానుభూతిగా రాజమహేంద్రవరానికి వచ్చిన నేతలు, కార్యకర్తలు, ప్రజలకు లోకేశ్ ధైర్యం చెప్పడం తదితర పరిణామాలు దాదాపు మూడు నెలలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో టీడీపీపై జిల్లా ప్రజల్లో భారీ సానుభూతి ఏర్పడింది. అదే సమయంలో బ్రేక్ తర్వాత ప్రారంభమైన యువగళం పాదయాత్ర జిల్లాలో చరిత్ర సృష్టించింది. ఊహించని సంక్షోభంతో కొంతవరకు డీలా పడ్డ పార్టీ శ్రేణుల్లో లోకేశ్ యాత్ర కొండంత ధైర్యాన్ని నింపింది. తిరిగి ఇప్పుడు రా..కదలి రా...అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు తుని సభకు వస్తుండడంతో జిల్లా పార్టీలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. వాస్తవానికి చంద్రబాబు గతేడాది ఫిబ్రవరిలో జిల్లాలో పర్యటించారు. జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహించి ఎన్నికల వేడి రాజేశారు. ఆ తర్వాత కాకినాడ రూరల్‌లో సెప్టెంబరులో జోన్2 సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత స్కిల్ కేసులో అక్రమంగా అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వెళ్లారు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత జిల్లాకు చంద్రబాబు రావడం ఇదే మొదటిసారి కావడంతో బుధవారం నాటి సభ ఏ స్థాయిలో ఉంటుందనే అంచనాలు నెలకొన్నాయి.

వైసీపీలో వణుకు

అటు పార్టీ నేతలు సైతం ఈ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించడానికి సన్నాహాలు పూర్తిచేశారు. కాగా ఇప్పటికే టీడీపీ గతేడాది రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించి సంచలనం సృష్టించింది. వీటికి ప్రజల్లో విశేష ఆదరణ లభించింది. బుధవారం నాటి సభలో చంద్రబాబు వైసీపీ పాలనా వైఫల్యాలపై ఎలుగెత్తడంతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను మరోసారి ప్రస్తావించి జనాదరణ రాబట్టనున్నారు. కాగా చంద్రబాబు సభ నేపథ్యంలో జిల్లా వైసీపీలో వణుకు పుడుతోంది. ఇప్పటికే ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను పక్కన పెట్టి వచ్చే ఎన్నికల కోసం అధిష్ఠానం కొత్త వారికి టిక్కెట్లు ఇవ్వడంతో జిల్లా పార్టీలో కాకరేగుతోంది. పలు నియోజకవర్గాల్లో పార్టీ రెండు ముక్కలైంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు తుని రాక నేపథ్యంలో పార్టీలో కీలక వికెట్లు చేజారిపోతాయేమోనని వైసీపీ కంగారు పడుతోంది.

నేడు తునికి చంద్రబాబు రాక



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ శ్రేణులు

- రా కదిలిరా సభలో ప్రసంగించనున్న టీడీపీ అధినేత
- సభా ప్రాంగణంలో పూర్తయిన భారీ ఏర్పాట్లు

తుని రూరల్, జనవరి 9: టీడీపీ, జనసేన పొత్తు అనంతరం పార్లమెంట్ పరిధిలో టీడీపీ అధినేత చంద్రబాబు తొలి సభ కావడం, చంద్రబాబు అక్రమ అరెస్ట్, విడుదల, జగన్‌పాలనలో మోసపోయి రోడ్డెక్కిన వివిధ వర్గాల ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో తునిలో సభ జరగడంతో చంద్రబాబు సభకు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో పార్లమెంట్ పరిధిలో తొలిసభ కావడంతో మాజీమంత్రి, ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు నేతృత్వంలో కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బండారు సత్యనారాయణమూర్తి, జిల్లాఅధ్యక్షుడు జ్యోతుల నవీన్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలు సభ ఏర్పాట్లును పర్యవేక్షించారు. కాకినాడ పార్లమెంట్‌లో 7నియోజకవర్గాలతో పాటుగా పాయకరావుపేట, నర్సీపట్నం, తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణంవద్ద భారీ ఏర్పాట్లు చేశారు.

● భారీ వేదిక ముస్తాబు

తునిలో చంద్రబాబు సభకు పక్కాఏర్పాట్లు చేశారు. లక్షమంది జనసమీకరణతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. వేదిక నిర్మించడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కె ఈవెంట్స్ బృందం స్టేజ్‌ఏర్పాటు పనులు శరవేగంగా చక్కబెడుతోంది. ఏపీలో ఎక్కడ సభ జరిగితే అక్కడ వేదిక నిర్వహించే ఈ బృందం 48గంటల ముందే చేరుకుని 10వాహనాలతో 100కు పైగా కార్మికులతో పగలు, రాత్రి శ్రమించి పనులు పూర్తిచేశారు. వేదికపై 80 మంది కూర్చోవడానికిసరిపడా నిర్మాణం పూర్తి చేశారు. 60 అడుగులు పొడవు, 40అడుగుల వెడల్పు, 5అడుగుల ఎత్తులో వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

● సభకు పోలీసుల పర్యవేక్షణ

తునిలో చంద్రబాబు సభను పర్యవేక్షించేందుకు పోలీస్ అధికారులు సన్నద్ధమయ్యారు. నేడు జరగనున్న సభకు పెద్దఎత్తున జనాలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటికే డీఎస్పీ లతాకుమారి సభా ప్రాంగణంవద్ద ఏర్పాట్లు, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. 150మంది పైబడి పోలీసులు చంద్రబాబు సభ వద్ద విధులు నిర్వహించనున్నారు. భారీ వాహనాలు దారి మళ్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో జాతీయ రహదారి గుండా వచ్చేవాహనాలను జగన్నాధగిరి కూడలిమీదుగా రైల్వే బ్రిడ్జి కింద నుంచి సభావేదిక వద్దకు వాహనాలు రప్పించేందుకే ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలకు, వీఐపీలకు, సాధారణ కార్యకర్తలకు, ఆటోలకు, ద్విచక్రవాహనాలకు ఇప్పటికే పార్కింగ్ ప్రాంగణాన్ని నిర్దేశించి ఐడెంటీ బోర్డులు ఏర్పాటు చేశారు.

● చంద్రబాబు షెడ్యూల్ ఇలా

బొబ్బిలిలో సభ ముగించుకుని మధ్యాహ్నం 3.30గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 3.35గంటలకు చామవరంహెలిప్యాడ్‌వద్ద ల్యాండ్‌కానున్నారు. 3.45 గంటలకు ఎస్.అన్నవరం పరిధిలో గల సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3.45 నుంచి 5.45 వరకు బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. 6గంటలకు తుని నుంచి బయలుదేరి 8గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- జగన్ అడ్డగోలు హామీలతో అన్నివర్గాలు రోడ్డున పడ్డాయి
- రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం ఎంతో ఉంది
- తుని మీడియా సమావేశంలో టీడీపీ నాయకుల వెల్లడి

తుని రూరల్, జనవరి 9: వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని జగన్ అడ్డుగోలు హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా ముంచాడని తునిలో టీడీపీ నేతలు మీడియా సమావేవంలో ధ్వజమెత్తారు. బుధవారం జరగనున్న సభ ఏర్పాట్లు, వైసీపీ ప్రభుత్వవిధానాలపై మాజీ మంత్రి, ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ మూర్తి, చింతకాయల అయ్యన్నపాత్రుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ న్యాయపరమైన హక్కులు నెరవేర్చాలని, ఇచ్చిన హామీలునెరవేర్చాలంటూ అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు ఒప్పంద కార్మికులు రోడ్డు ఎక్కితే జగన్ ప్రభుత్వం స్పందించకపోగా వారిని భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ప్రజలు కష్టాల్లో వారికి తోడుగా టీడీపీ ఎప్పుడు ఉంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం ఎంతైనా ఉందని నాడు తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ పిలుపుకు ఎంతటి స్పంద న వచ్చిందో అదేరీతిలో చంద్రబాబురా కదలిరా పిలుపుకు ప్రజలు ఉప్పెనలా తరలివస్తున్నారన్నారు. నేడు జరుగనున్న చంద్రబాబు సభకు పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి అంచనాకు మించి ప్రజలు చేరుకునే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇప్పటికే టీడీపీ, జనసేన కార్యకర్తలు ఈ సభను విజయవంతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, టీడీపీ నాయకులు ముదులూరి మురళీకృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



కార్పొరేషన్‌కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో అక్కినేని వనజ

తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తాం

- మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 : ముఖ్యమంత్రి జగన్ గారు రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలు ఇప్పటికైనా పరిష్కరించి సమ్మెను విరమింపజేస్తారా లేక తాడేపల్లి ప్యాలెస్ ముట్టడించమంటారా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 6వ రోజు మంగళవారం కలిసి మద్దతు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెతో ఆగిన పనులు చేయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయింపులు చేసే కంటే డిమాండ్స్‌ను నేరవేరిస్తే మంచిదన్నారు. జగన్ ఇచ్చిన హామీలనే నేరవేర్చకుండా ద్రోహం చేశారన్నారు. నిర్లక్ష్యం వీడకపోతే రెగ్యులర్ కార్మికులు చేసే పనులను ఔట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకుంటారని హెచ్చరించారు. మరొక పక్క నగరంలో చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెను విరమింపచేయాలని కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని కార్మిక నేతలు తెలిపారు. మహా ధర్నాలో కార్మికులు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రెడ్డిరమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద, ఎం శివ, గిరి, భాగ్యలక్ష్మి, ముత్యాల పోలమ్మ పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీ పార్టీలను చిత్తుగా ఓడించాలి

- రైతులు, కార్మికులు, వర్కర్లను విస్మరించిన పార్టీలు
- 2024 ఎన్నికలు దేశ ప్రజలకు చాలా కీలకం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



రైతు సంఘం రాష్ట్ర సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : రైతాంగ సమస్యలపై ప్రతి ఒక్కరూ రాజీలేని పోరాటం చేయాలని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని రాష్ట్రంలో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రైతు ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రరంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు రెండోరోజైన మంగళవారం హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలకు కార్పొరేట్ కంపెనీలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సబ్సిడీలు కూడా ఇవ్వకపోవడంతో రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ రామమందిరాన్ని తెరపైకి తెచ్చారని, అయోధ్య రామమందిరంలో విగ్రహప్రతిష్ఠకు వేలకోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలు దేశప్రజలకు చాలా కీలకమైనవని, లౌకికవాదం కావాలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న బీజేపీ కావాలో ప్రజలు తేల్చుకోవాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రపదేశ్‌లో పనిచేసిన ముఖ్యమంత్రులతో పోల్చుకుంటే జగన్మోహనరెడ్డిలాంటి నియంత మరొకరు లేరన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఏ ఒక్క హామీ జగన్ అమలు చేయలేదన్నారు. దీంతో వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలో వర్కర్లు, ఉద్యోగస్తులు సమ్మెబాట పడితే జగన్మోహనరెడ్డి పోలీసులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మా నాయకుడు మాట తప్పడు, మడమ తప్పడు. మోకాలు తిప్పడు, ఏం చెబితే అది చేస్తాడు అంటూ వైసీపీ నేతలు పదే పదే భజన చేస్తుంటారని, కానీ జగన్మోహనరెడ్డి చట్టాన్ని అంగీకరించడు, కోర్టు చెప్పింది వినడు. చివరకు తాను చెప్పింది కూడా అమలు చేయడు అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, ఆయా జిల్లాల రైతు ప్రతినిధులు మాట్లాడారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రామచంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కాటమయ్య, డేగా ప్రభాకర్, జమలయ్య లక్ష్మి, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఆలమూరు, జనవరి 9: ఆలమూరు మండలం పెదపళ్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన ఈతకోట శ్రీనివాసరావు(45) వెదురుమూడి వెళ్లి కొత్తూరు సెంటర్ వైపు ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వస్తుండగా పెదపళ్ల కోళ్ల ఫారం సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఈమేరకు ఆలమూరు ఎస్ఐ శీనునాయక్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావులపాలెం పోలీసుస్టేషన్‌పై ఏసీబీ అధికారుల దాడి

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఎస్ఐ వెంకటరమణ, ఆపరేటర్ సత్యప్రసాద్

రావులపాలెం, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్‌లు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరుకు చెందిన సత్తి విజయ రామ కృష్ణారెడ్డి జియో ఫైబర్ డిస్ట్రి బ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల రావుల పాలెంలో జియో ఫైబర్ డిస్ట్రి బ్యూటర్‌కు చెందిన ఫైబర్ నెట్ కేబుల్ కారణంగా ఒక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మరణించాడని ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో విజయరామ కృష్ణారెడ్డిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఎఫ్ఐఆర్ నమోదులో తక్కువ శిక్ష పడే సెక్షన్(304ఏ) వేసి స్టేషన్ బెయిల్ ఇచ్చే విధంగా చేస్తామని దానికి రూ.లక్ష లంచం ఇవ్వాలని పోలీసులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ ఆదేశాలతో కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్ రూ.25వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా రాజమహేంద్రవరం నుంచి అవినీతి నిరోధకశాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పటుకున్నారు. ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్‌ను అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామ న్నారు. స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇటువంటి దాడులు ఎప్పుడూ జరగలేదు. రక్షించాల్సిన పోలీసులే ఈవిధంగా లంచాలు డిమాండ్ చేస్తుంటే సామాన్య ప్రజలు సరైన న్యాయంకోసం ఎవ్వర్నీ ఆశ్రయించాలని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఆనందంగా వెళ్లి.. నిర్జీవులుగా..



విద్యార్థులు గల్లంతైన సీతపల్లి వాగు

- ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు
- 'ఇద్దరు విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు'
- 12 గంటలకు తండ్రికి చివర్ కాల్

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి)/రంపచోడవరం : అల్లూరి జిల్లాలోని రంపచోడవరంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగులో ఇద్దరు విద్యార్థులను మింగేసి ంది. ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమ హేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మొదటి ఏడాది ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం(8)తో పూర్తయ్యాయి. 11వ తేదీ నుంచి సెలవులు. దీంతో 10మంది విద్యార్థులు ప్లెజర్ ట్రిప్ ప్లాన్ చేసుకున్నారు. కాలేజీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతుండడంతో ఐదుగురు విద్యార్థులు ఆగిపోయారు. మొదటి ఏడాది టీబీఏ(డిజిటల్ మార్కెటింగ్) చదువుతున్న ముగ్గురు అమ్మా యిలు, బీకాం చదువుతున్న ఇద్దరు అబ్బాయిలు ద్విచక్ర వాహ నాలపై రంపచోడవరం వైపు వెళ్లారు. సీతపల్లి వాగులో కేరింతలు కొడుతూ గడిపారు. అయితే షేక్ జబీర్(19)రాయిపై నుంచి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తూ జారి వాగులో పడిపోయాడు. అక్కడ లోతుగా ఉండడంతో కేకలు వేస్తుండగా రక్షి ద్దామని వెంటనే సుభర్షిని(19) వాగులోకి దూకింది. ఇద్దరూ ప్రవాహంలో గల్లంతయ్యారు. మిగతా ముగ్గురూ కేకలు వేయ డంతో స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రంప చోడ వరం పోలీసులు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. రెండు మృతదేహాలను బయటకు తీసి రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.





మృతురాలు శుభర్షిని, మృతుడు జబ్బీర్

● నాన్నకు చివరిసారిగా

రాజమహేంద్రవరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన సుభర్షిని తండ్రి బెంగళూరులో ఉద్యోగం చేస్తుండడంతో భార్యతో అక్కడే నివాసం ఉంటున్నారు. దీంతో సుభర్షిని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. జబీర్ తల్లిదండ్రులు రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. జబీర్ తండ్రి ఫ్లెక్స్ బోర్డులు చేస్తుంటారు. అతడి అన్నయ్య కూడా ఆర్ట్స్ కళాశాలలోనే చదువుకుంటున్నాడు. జబీర్ ప్రతి గంటకూ తన తండ్రికి ఫోన్ చేశాడు. కానీ మధ్యాహ్నం 12గంటల సమయం నుంచీ ఫోన్ రావడం ఆగిపోయింది. 3గంటల సమయంలో విషాద విషయం ఆయనకు తెలియడంతో రంపచోడవరం వెళ్లారు.

● నేటి కార్యక్రమాలు నిలిపివేత

ఆర్ట్స్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రిన్సిపాల్ రామచంద్రరావు నిర్వహిస్తున్నారు. బుధవా రం కైట్ ఫెస్టివల్, సంప్రదాయ వంటకాలు, సంప్రదాయ వస్త్రధా రణ తదితర కార్యక్రమాలు ఉన్నాయి. ఇద్దరు విద్యార్థుల మరణ వార్త తెలిసే సమయానికి ఆయన విజయవాడ అధికారిక సమావేశంలో ఉన్నారు. దుర్ఘటన తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బుధవారం జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేశారు. ఉదయం 11గంటలకు విద్యార్థుల సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. సభర్షిని కాలేజీకి సంబంధించిన కార్యక్రమాల్లో చాలా యాక్టివ్‌గా, సమన్వయం చేసుకుంటూ ఉండేదని.. బీబీఏ విద్యార్థులకు డ్రెస్‌కోడ్ విషయంలో కూడా పట్టుబట్టి సాధించు కుందని.. ఓ మంచి విద్యార్థిని కాలేజీ కోల్పోయిందని రామచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి 'ఆంధ్రజ్యోతి'తో ఆవేదన వ్యక్తం చేశారు.

● సీతపల్లి వాగులో..

అడవుల్లోని కాలువలను దొంగ వాగులంటారు. ఎప్పుడు ప్రవాహం వస్తుందో ఎవరూ ఊహించలేరు. పైగా ఎక్కడ లోతుగా ఉంటుందో కూడా చెప్పడం కష్టం. ఈ వాగువద్ద రద్దీ వేళల్లో కూడా సరైన రక్షణ, పోలీసుల పర్యవేక్షణ ఉండడం లేదని స్థాని కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే ఇద్దరు విద్యార్థులు బలైపోయారని మండిపడుతున్నారు.

గోదావరినదిలో కలిపేసిన ఎస్మా-2 జీవో ప్రతులు



పి.గన్నవరం వైనతేయ గోదావరి నదిలో ఏస్మా-2 జీవో ప్రతులను కలిపేస్తున్న అంగన్‌వాడీలు

పి.గన్నవరం, జనవరి 9: సమస్యలు పరిష్కరించే వరకు మేం తగ్గేదేలా... అంటూ అంగన్‌వాడీలు ఈనెల 6న ప్రభుత్వం విడుదల చేసిన ఏస్మా-2 జీవో ప్రతులను వైనతేయ గోదావరినదిలో కలిపేసి వినూత్న నిరసన తెలిపారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా 29వ రోజు మంగళవారం పి.గన్నవరం అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా గోదావరినది వద్దకు చేరుకుని సంబంధిత జీవో ప్రతులను నీటిలో కలిపేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ నాయకులు బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, జి.రాధ, ఎ.దుర్గామల్లేశ్వరి, ఆశాజ్యోతి, లలిత, కె.రాజ్యలక్ష్మి, జి.ప్రమీల, జి.అనంతలక్ష్మీదేవి పాల్గొన్నారు.

లాటరీ పేరుతో కుచ్చుటోపీ

- అనుమానం రాకుండా కొందరికి ఖరీదుకానీ వస్తువుల పంపకాలు
- ఒక్కొక్కరి నుంచి రూ. 3 వేల నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు
- గిరిజన పల్లెలే లక్ష్యంగా రూ. లక్షల్లో వసూళ్లు
- వారం రోజులుగా ఫోన్ల స్విచ్ఛాఫ్... లబోదిబోమంటున్న బాధితులు

ఎటపాక, జనవరి 9 : వారంతా అమాయక గిరిజనులు.... రోజూకూలీకి, వ్యవసాయ పనులకు వెళితేగానీ పూట గడవనివారు... అలాంటి అమాయక త్వాన్ని ఆసరగా చేసుకుని, కొందరు కేటుగాళ్లు లాటరీ పేరుతో బురిడీ కొట్టించారు... రూ.లక్షల్లో వసూళ్లు చేసి, చివరకు బోర్డు తిప్పేసి, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయామని, గ్రహించి గిరిజనులు లబోదిబోమంటున్నారు... ఎటపాక మండలంలో చాలా మంది బాధితులు ఉండగా, ప్రధానంగా కృష్ణవరం, భూపతి రావుపేట, కొత్తూరు, కన్నాపురం, లక్ష్మీపురం, పాలమడుగు తదితర గ్రామాల్లోని గిరి జనులు ఉన్నారు. ఒక్కో గ్రామం నుంచి 300నుంచి 400 వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బాధితుల్లో రూ.3 నుంచి రూ.7 వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తో ంది. ఈ గిరిజన గ్రామాలో గత మూడు నెలలుగా భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా సారపాక కేంద్రంగా శ్రీ హనుమాన్ ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్ లాటరీ పేరుతో కొందరు కేటుగాళ్లు ఓ బ్రౌచర్ ముద్రించి, అందులో తొలుత ప్రారంభ వారానికి రూ.20 నుంచి చివరి వారం వరకు 307 వరకు స్కీమ్ ఉన్నట్లు ప్రచారం నిర్వహించారు. ప్రతీవారం గ్రామాల్లోకి వచ్చి డబ్బులు కట్టించుకుని సంతకాలు కూడా చేశారు.. అయితే ఈ లాటరీ స్కీమ్‌పై ఎవరికీ అనుమానం రాకుండా కొందరికి తక్కువ ఖరీదైన ప్లాస్కో, కుక్క ర్లు, లైట్లు, ఇడ్లీ పాత్రలు ఇచ్చి, లాటరీ తగిలిందని నమ్మ బలికించే ప్రయత్నం చేశారు. దాంతో ఒకే కుటుంబంలో ఇద్దరి నుంచి ముగ్గురి పేరున లాటరీ కట్టారు. అయితే కొందరి వద్ద నుంచి రూ.5వేలు కట్టించుకుని ఫ్రిజ్‌లు, డబుల్‌కాట్ మంచాలు, డ్రెస్సింగ్ టేబుళ్ల ఇస్తామని నమ్మబలికించారు. చివరకు ఫోన్లు సిచ్ఛాఫ్ చేసి, ఉడాయించడంతో బాధిత గిరిజనులు లబోదిబో మంటున్నారు. దాదాపుగా ఎటపాక మండలంలో కేటు గాళ్లు రూ.20 నుంచి రూ. 30లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. సారపాకలో కూడా వారి ఆచూకీ లేనట్లు కొందరు బాధితులు పేర్కొంటున్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం



డాక్టర్ యనమదల మురళీకృష్ణ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 9: సంక్రమణ వ్యాధులు, వాటి ప్రభావాలు ఇతర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ పుస్తకాలు, ఆర్టికల్స్ రాసి భరోసా నింపుతున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ఈనెల 11న ఏలూరులో జరగనున్న సాహిత్య సంక్రాంతి సంబరాల్లో డాక్టర్ మురళీకృష్ణను విశిష్ట సాహిత్య పురస్కారంతో సత్కరించనున్నట్లు అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తెలిపారు.

ఎన్ఎస్ఎస్ సాహసయాత్ర విజయవంతం

దివాన్‌చెరువు, జనవరి 9: యువజన వ్యవహారాలు క్రీడాశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ కేంద్రం పోంగ్‌డామ్‌వద్ద నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సాహస యాత్రను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ యాత్రకు హాజరైన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. గతనెల 19 నుంచి 28 వరకూ ఈయాత్ర సాగిందన్నారు. దీనికి నన్నయ వర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఒక పీవో హాజరయ్యారన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.రాజశేఖర్, కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ నుంచి ఐ.ఆనందబాబు, నన్నయ క్యాంపస్ నుంచి ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం నుంచి జి.ఆది, భీమవరం బీవీ రాజు కాలేజ్ ఆఫ్ సైన్స్ నుంచి పి.దుర్గాగణేష్, గైట్ కళాశాల నుంచి సీహెచ్ చరిష్మా, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి పి.సాయిరత్నం, కిర్లంపూడి ఎస్వీవీఎస్ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.ఉష, రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి కె.హర్షిణి, పాలకొల్లు డీఎస్ఆర్ మహిళా కళాశాల నుంచి ఎస్.లక్ష్మీదేవి పాల్గొన్నారన్నారు. మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా తమ సాహసయాత్రను కొనసాగించారని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు వలంటీర్లకు, పీవోకు అభినందనలు తెలిపారు.

సెలవుల్లో పనికి వెళ్లి యువకుడి మృత్యువాత



మృతి చెందిన కోడి సంగీత్‌కుమార్

దేవరపల్లి, జనవరి 9: చదువుకుంటూ సెలవు రోజులు కావడంతో కూలిప నికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన ఏడుగురు యువకులు స్నేహితులు. వేర్వేరు చోట్ల చదువుకుంటున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో పనిలోకి వెళ్దామనుకున్నారు. మంగళవారం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ట్రాక్టర్‌లో కొబ్బరాకులు లోడు చేసుకుని మధ్యాహ్నం తిరిగి కలవలపల్లి బయలుదేరారు. ట్రాక్టర్ లోడుపై నలుగురు, ట్రాక్టర్ ఇంజన్ మధ్యలో ఉన్న రాబర్ పైన ముగ్గురు నిలుచున్నారు. త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు గోతులమ యంగా ఉంది. ఎదురుగా వస్తున్న చెరుకు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రాబర్‌పై కూర్చున్న వారిలో కోడి సంగీత్‌కుమార్(19) ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ అతని పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సంగీత్‌కుమార్ నిడదవోలులో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి కూలి పనికి వెళ్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సంఘటన ప్రాం తాన్ని ట్రైనీ డీఎస్పీ భానోదయ పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకు న్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చదువు, ఆరోగ్యమే నిజమైన సంపద

- కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య
- మాతృభాషపై పట్టు ఉండాలి
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా శ్రీప్రకాష్ విద్యా సంస్థల వార్షికోత్సవం

పాయకరావుపేట/తునిరూరల్, జనవరి 9: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన సంపద చదువు, ఆరోగ్యమేనని కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వార్షికోత్సవ వేడుకలను 'జోష్' పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి గ్రహించాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. బాగా చదువుకుని, ఆరోగ్యం వుంటే కచితంగా ఉన్నతస్థితికి చేరుకుంటారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మాతృభాషపై పట్టు వుంటేనే మిగిలిన భాషలపై పట్టు సాధించగలమని అన్నారు. జీవితంలో ఉత్తమ మార్గాన్ని ఎంచుకునే శక్తిసామర్థ్యం చదువు ద్వారానే వస్తుందన్నారు. మరో గౌరవ అతిథి బసవ తారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ, ఎటువంటి స్వార్థం లేకుండా జ్ఞానాన్ని పంచే గురువులను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. సెకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్‌డ్ మైనింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నాదెళ్ల వెంటసుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ ఎండీ వైవీఎస్.చలపతిరావు తదితరులు మాట్లాడారు. తొలుత ఏపీ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జాతీయస్థాయి ఆటల పోటీలు, వివిధ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా, పిరమిడ్స్, జుంబా డ్యాన్స్, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ,విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శాంతి కపోతాలను ఎగురవేస్తున్న ముఖ్యఅతిథులు, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న దృశ్యం

104 విభాగంలో ఉద్యోగాల భర్తీ

జీజీహెచ్ (కాకినాడ) జనవరి 9 వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా సేవలు అందిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్లలో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నుంచి మంగళవారం ప్రకటన వెలువడింది. ఇందులో 20 డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈవో), 20 డ్రైవర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో డా. నరసింహనాయక్ తెలిపారు. అభ్యర్థులు ఎదైనా డిగ్రీ పూర్తి చేసిన కంప్యూటర్, టైపింగ్‌లో అనుభవం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు డీఈవో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే 10వ తరగతి పూర్తి చేసి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉన్న పురుష అభ్యర్థులు డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ రెండు ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 35 ఏళ్లుగా నిర్ణయించారు. అర్హత కలిగి ఆశక్తి ఉన్న అభ్యర్థులు వారి బయోడేటాకు విద్య అర్హతతోపాటు లైసెన్స్ పత్రాలను దరఖాస్తుకు జతచేసి ఈనెల 10, 11 తేదీలలో కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న 104, 108 కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'కొత్త పింఛను విధానం రద్దు చేయాలి'

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛను విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఎంప్లాయీస్ సంఘ్ పిలుపుమేరకు రైల్వే ఉద్యోగులు రైల్వేస్టేషను ఆవరణలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు వెంటనే నిర్ణయం ప్రకటించాలని నినాదాలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య, విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వ రరావు దిశా నిర్దేశంతో పోరాటం సాగిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో కూడా నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమంలో వి.త్రినాథ్, ఎస్ఎస్ చంద్రమౌళి, జేడీ ప్రసాద్, టి.నాగేంద్రరావు, అరవ నాగేంద్రకుమార్, డి.రమేశ్ పాల్గొన్నారు.

కాకినాడ

అంబేడ్కర్ స్మారక మందిర నిర్మాణం పరిశీలన

తాళ్లరేవు, జనవరి 9: చొల్లంగి 216 జాతీయ రహదారి పక్కన గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మారక మందిరం నిర్మాణాన్ని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మంగళవారం పరిశీలించారు. భవనాన్ని త్వరలో పూర్తిచేయాలని టీడీపీ నేతలను ఆదేశించారు. టీడీపీ నేతలు కట్టా త్రిమూర్తులు, గర్రే లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ మహాలక్ష్మి, ఈతమూడి రాఘవ, శ్రీపాదం సత్యనారాయణ, పులపకూర త్రిమూర్తులు పాల్గొన్నారు.

'అధికారులకు నోటీసులు జారీ చేయాలి'

సామర్లకోట, జనవరి 9: సామర్లకోట మండల పరిషత్ సమావేశానికి గైర్హాజరైన ఆరుగురు అధికారులకు నోటీసులు జారీచేయాలని ఎంపీడీవో డి.శ్రీలలితను ఎంపీపీ బి.సత్తిబాబు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. 3 నెలలకొక పర్యాయం జరిగే మండల పరిషత్ సమావేశానికి 20 మంది అధికారులు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ఆరుగురు వివిధ శాఖల నుంచి గైర్హాజరయ్యారన్నారు. పంచాయతీ కార్యదర్శుల్లో కొన్ని గ్రామాల కార్యదర్శులు విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని, సక్రమంగా విధులు నిర్వర్తించకపోతే చర్యలు తప్పవని ఎంపీపీ హెచ్చరించారు. మండలంలో విద్యాశాఖ పనితీరుపై ఎంఈవో శివరామకృష్ణయ్య సమాచారంపై ఎంపీపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో మేడిశెట్టి వీరభద్రం, కేసారపు వీరప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

'గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి'

కరప, జనవరి 9: ప్రతి నెల గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాల మేరకు పోషకాహారం తీసుకోవాలని డివిజన్ వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆయన వైద్య పరీక్షలు చేసి, సూచనలు చేశారు. కరప పీహెచ్‌సీ పరిధిలోని 11 ఆరోగ్య ఉపకేంద్రాల ఏఎన్ఎంలు 30 మంది గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకురాగా డాక్టర్ శ్రీనివాస నాయక్, డాక్టర్ అంజలి పీహెచ్‌సీ సిబ్బందితో కలసి గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్ట్‌లు నిర్వహించి సూచనలు చేశారు. వేళంగిలో గర్భిణులకు డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ సింధూర 15 మందికి పరీక్షలు చేశారు.

'దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలి'

పెద్దాపురం, జనవరి 9: విద్యార్థులు వైజ్ఞానిక జిజ్ఞాసను పెంపొందించుకోవాలని సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు. స్థానిక జవహర్ నవోదయాలో పీఎంశ్రీ యాక్టివిటీలో భాగంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. ప్రతీ విషయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకోవాలని, సాధనలతోనే ఫలితాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ప్రిన్సిపాల్ ఆర్.కమలం, వైస్.ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, శ్రీనివాస్, కేశవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'కోడిపందేలు, పేకాటకు దూరంగా ఉండాలి'

గొల్లప్రోలు, జనవరి 9: సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ సూచించారు. గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, జూదాలకు దూరంగా ఉండాలని, వాటిని నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలంతా సోదరభావంతో మెలగాలని కోరారు.

జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ముట్టడి

కార్పొరేషన్(కాకినాడ) జనవరి 9: సమస్యలతో పోరాడుతున్న మున్సిపల్ కార్మికులు మంగళవారం జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పిర్ల కృష్ణారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం ప్రదర్శనగా వెళ్లి జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏసీఎల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పిర్ల కృష్ణారావు మాట్లాడుతూ పనివేళలు సక్రమంగా అమలు చేయాలని, పండుగ, జాతీయ సెలవులు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 14 సర్కిల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తొండంగి మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

తొండంగి, జనవరి 9: 2024-25 సంవత్సరానికిగాను రూ.73వేల 600 మిగులుతో తొండంగి మండల పరిషత్ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. మంగళవారం వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అధ్యక్షతన మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్ బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 24-25 ఆర్థిక సంవత్సరానికిగాను అంచనా ఆదాయం రూ.32కోట్ల20 లక్షల 23 వేలుగాను.. వ్యయం రూ.32 కోట్ల19 లక్షల 49వేల 400 గాను చూపారు. ఏ కొత్తపల్లి సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి చంద్రగిరి మాట్లాడుతూ తమ గ్రామంలో యానిమేటర్లు సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా రుణాలు తమకు నచ్చినవారికి మాత్రమే ఇప్పించుకుంటున్నారన్నారు. తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంఈవో షేక్‌బాబ్జి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సొసైటీ అధ్యక్షుడు పెదిరెడ్ల సురేష్ ఉన్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

ప్రత్తిపాడు, జనవరి 9: ప్రత్తిపాడు సెబ్ అధికారులు మంగళవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో దాడులు నిర్వహించి 800లీటర్ల సారాను ధ్వంసం చేసి 50లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నారు. ముగ్గురు మహిళలను కూడా అరెస్ట్ చేశారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో 800లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని దేవర రాంబాబుపై కేసు నమోదు చేశారు. ఏలేశ్వరం మండలం సి.రాయవరం వంతెన వద్ద 10 లీటర్ల సారాను, మోటార్‌బైక్ స్వాధీన పరుచుకోగా పాలబోయిన రమణపై కేసు నమోదు చేశారు. కిర్లంపూడి మండలం వేలంకలో 20లీటర్ల సారా స్వాధీన పరుచుకుని కాళ్ళ పాదాలమ్మ, కాళ్ళ అప్పయ్యమ్మలను అరెస్ట్ చేశారు. రామచంద్రపురం గ్రామంలో సారా కేసులో నిందితురాలిగా ఉన్న వి.లక్ష్మిని అరెస్ట్ చేసినట్టు సీఐ అశోక్ తెలిపారు. దాడుల్లో సెబ్ ఇంటిలిజెన్స్ వింగ్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, సెబ్ ఎస్ఐ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటి మట్టి శివలింగాల తయారీ

జగ్గంపేట, జనవరి 9: ఇర్రిపాక ఏలేరు నది తీరాన ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద నిర్వహించి తలపెట్టిన మహాకుంభాభిషేకం కోసం కోటి మట్టి శివలింగాల తయారీ జరుగుతున్న విషయం విదితమే. టీడీపీ రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షురాలు పోలినాటి ధర్మానందకుమారి పాల్గొని తయారుచేసిన లింగాలను మాజీ ఎమ్మెల్యే నెహ్రూ సతీమణి జ్యోతుల మణికి అందించారు. అడబాల సత్తిబాబు, జె.కొత్తూరు, టీడీపీ మహిళా మండలాధ్యక్షురాలు తిప్పన సత్యవతి ఉన్నారు.

'ఆదిత్య'లో వర్క్‌షాపు

గండేపల్లి, జనవరి 9: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో ఆటోడెస్క్ 3డీ అనే అంశంపై వారంపాటు వర్క్‌షాపు నిర్వహించారు. ఐఈఐ ఇండియా కాకినాడ జోన్‌తో కలిసి విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశారు. 3డీ మోడలింగ్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్ రంగాల్లో అవగాహన కల్పించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన సంతోష్, మెకానికల్ విభాగాధిపతి జుబెరుద్దీన్, అసోసియేట్ ప్రొఫెసర్ శరవణ్ పాల్గొన్నారు.

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల అమెరికాకు చెందిన మెంఫిస్ వర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకుంది. దీని ప్రకారం ఇక్కడి అధ్యాపకులు అక్కడ పోస్ట్ డాక్టరేట్ చేసే అవకాశం ఉంది. ఆదిత్య విద్యార్థులు ఎంఎస్, పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులకు అడ్మిషన్లు పొందే వీలుంటుంది. కార్యక్రమంలో మెంఫిస్ వర్సిటీ ప్రొఫెసర్ సజ్జన్ శివ, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీన్ రామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల రిలే దీక్షలు

సామర్లకోట, జనవరి 9: రైల్వే ఉద్యోగులందరికీ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పున్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ పిలుపు మేరకు మంగళవారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు కె.రావు, ఎం.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షల్లో సామర్లకోట, కాకినాడ, అనపర్తి, ద్వారపూడి స్టేషన్లకు చెందిన సుమారు 80 మంది రైల్వే ఉద్యోగులు, కార్మికులు ఆసీనులయ్యారు. సంఘ్ ఛైర్మన్ టి.ఈశ్వరరావు, వర్కింగ్ ఛైర్మన్ బి.రామకృష్ణ, త్రినాధ్, గోపాల్‌రెడ్డి, ప్రసాద్ నాయకత్వం వహించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ నేత శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

గండేపల్లి, జనవరి 9: మండలంలో తాళ్ళూరు గ్రామ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం ప్రకారం మండలంలో ఉప్పలపాడుకు చెందిన నూకతట్టు బుల్లియ్య, నూకతట్టు దుర్గ, ఇనుకోటి నాగలక్ష్మి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా ఉప్పలపాడు నుంచి తాళ్ళూరుకు యూటర్న్ తిరుగుతూ ఉండగా రాజమండ్రి వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సేఫ్టీ వాహన సిబ్బంది సతీష్ గాయాలైనవారిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

సర్పవరం జంక్షన్, జనవరి 9: సర్పవరం గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.2.25 కోట్ల నిధులతో నిర్మించిన పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం, శంకుస్థాపన మంగళవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిర్వహించారు. జయంత్‌నగర్‌లో రూ.26 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ భవనం, బీసీ కాలనీలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-3 భవనం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.1.38 కోట్లతో నిర్మించిన 2 ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రారంభించారు. కుళాయి కనెక్షన్ కోసం పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జి, ఏఎంసీ ఛైర్మన్ గీసాల శ్రీను, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీలు గుత్తుల శ్రీనివాసరావు, సారా రాజేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు పయనం

విజయవంతం చేయాలని టీడీపీ నేతల పిలుపు

నేడు తునికి వెళ్లనున్న పార్టీ శ్రేణులు



కాకినాడలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, జనవరి 9: రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలనను అంతమొందించేందుకు రా కదలిరా.. నినాదంతో తునిలో బుధవారం భారీ స్థాయిలో జరిగే టీడీపీ అధినేత నారా చంద్రబాబు బహిరంగ సభకు కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి 10 వేల మంది పయనమవుతున్నారని కార్యక్రమ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ వెల్లడించారు. జగన్నాథపురంలోని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆనందరావు మాట్లాడుతూ టీడీపీ-జనసేన పాలనకు ఈ సభ మార్గదర్శకం కానుందన్నారు. అధికార ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ 39 ఏళ్ల క్రితం ఇదే రోజున టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తిరుగు లేని ప్రజాదరణ పొందారన్నారు. అనంతరం చంద్రబాబు సభకు హాజరయ్యే నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి నగరంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నాగిడి నాగేశ్వరరావు, పెచ్చెట్టి విజయలక్ష్మి, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ పాల్గొన్నారు.

జగ్గంపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు బుధవారం తునిలో నిర్వహించి తలపెట్టిన రా కదలిరా బహిరంగ సభకు జగ్గంపేట నియోజకవర్గం నుంచి బస్సులు, కార్లు ఆటోలు ద్వారా పది వేలు మంది బయలుదేరివెళ్తామని జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద మీడియాకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుతిడు జ్యోతుల నెహ్రూ వివరించారు. ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తుకు ఆంధ్రుడా రా కదలిరా అనే నినాదంతో జిల్లాలో టీడీపీ, జనసేన జనచైతన్య యాత్రకు ఎన్నికల రణ క్షేత్రానికి నాంది పలికి రాష్ట్ర బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి ఈ సభ ద్వారా జగన్ ప్రభుత్వానికి రాష్ట్రంలో చోటు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో అనీష్ నెహ్రూ, దాపర్తి సీతారామయ్య అడబాల సత్తిబాబు, జ్యోతుల సత్యమూర్తి, మండపాక అప్పన్నదొర పాల్గొన్నారు.

పిఠాపురం: రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు అండగా నిలవాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో చలో తుని, రా కదలి రా కార్యక్రమంపై నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎక్కడా చీలకుండా అందరు ముందడగు వేయాలని కోరుకుంటున్నామని తెలిపారు. తునిలో చంద్రబాబు సభకు నియోజకవర్గం నుంచి పదివేల మందికి పైగా తరలివెళ్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు బోనం వెంకటరమణ, రుద్రరాజు వెంకటపతిరాజు, పట్టణ, మండలాధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, అనిశెట్టి సత్యానందరెడ్డి, పిల్లి చిన్నా, దేవరపల్లి రామారావు, సోము సత్యనారాయణ, చవ్వాకుల రామచంద్రరావు, సూరవరపు సుబ్బారావు, కోళ్ల బంగారుబాబు, నల్లా శ్రీను, అద్దూరి శ్రీను, రెడ్డెం రాజబాబు, మసకపల్లి రాజా, నూతాటి ప్రకాష్, నెక్కల సత్యనారాయణ, ఇమ్మిడిశెట్టి సోనాబాబు పాల్గొన్నారు.

రౌతులపూడి: తునిలో చంద్రబాబు సభకు టీడీపీ శ్రేణులు కదిలి రావాలంటూ ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. రౌతులపూడి మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

గండేపల్లి: చంద్రబాబు సభకు టీడీపీ గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు ఆధ్వర్యంలో 30 బస్సులు, 20కార్లలో టీడీపీ శ్రేణులు వెళ్లనున్నారు.

తొండంగి: చంద్రబాబు బుధవారం తునిలో నిర్వహించే రా కదలిరా సభకు కార్యకర్తలంతా వేలాదిగా తరలి రావాలని టీడీపీ పరిశీలకుడు రంగనాయకులు పిలుపునిచ్చారు. ఒంటిమామిడి టీడీపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రంగనాయకులు మాటాడారు. ప్రతి కార్యకర్త చంద్రబాబు సభ విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో తెలుగురైతు రాష్ట్రకార్యదర్శి పేకేటి హరికృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కోడ వెంకటరమణ, యూత్ అధ్యక్షులు బంటుపల్లి అన్వేష్, మురాలశెట్టి సత్యనారాయణ, గణేష్, గవరయ్య తదితరులు పాల్గొన్నారు.



తొండంగి : మాట్లాడుతున్న రంగనాయకులు

నేడు జిల్లాకు కార్మిక బస్సు చైతన్య యాత్ర

కాకినాడ సిటీ, జనవరి 9: రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా కార్యాచరణ చేపట్టేందుకు రాష్ట్ర టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో టెక్కలి నుంచి కుప్పం వరకు తలపెట్టిన కార్మిక బస్సు చైతన్య యాత్ర బుధవారం కాకినాడ జిల్లాకు చేరుతుంది. జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జగన్నాథపురంలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ వర్గాల కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకుని టీడీపీ కార్మిక బస్సు చైతన్య యాత్రను తలపెట్టిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం ఆందోళనలు చేస్తున్న పరిస్థితుల్లో వారందరికీ సంఘీభావం తెలిపి అండగా నిలవడం యాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సిటీ నియోజకవర్గ పరిశీలకుడు నాగిడి నాగేశ్వరరావు, అమలాపురం తెలుగు మహిళాధ్యక్షురాలు పెచ్చేటి విజయలక్ష్మి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, తాతపూడి రామకృష్ణ, వొమ్మి బాలాజీ, పంతాడి రాజు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

పిఠాపురం రూరల్, జనవరి 9: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడకు చెందిన హరీష్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పిఠాపురం మండలం రాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధునీకరించిన క్రీడామైదానాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని సూచించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్ తదితర కోర్టుల అభివృద్ధికి విరాళమిచ్చిన ట్రస్టు ప్రతినిధి హరీష్‌ను సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దేశినీడి ఏసుబాబు, పీడీ లంకా జార్జికర్నీడి సత్తిబాబు ఉన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు

సామర్లకోట, జనవరి 9: మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు సామర్లకోట ఎంపీడీవో డి.శ్రీలలిత వెల్లడించారు. సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభించనున్న ఈ పోటీల్లో ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్ పోటీలు అచ్చంపేట ఏడీబీ రోడ్డు మైదానం వద్ద ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో చెప్పారు. విజేతలకు బహుమతులు జేసీ ఇలాక్కియా అందజేస్తారని తెలిపారు.

గండేపల్లి: మండలంలో బుధవారం మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరగనున్నాయని ఎంపీడీవో వెంకట్రామన్ తెలిపారు. మల్లేపల్లి, గండేపల్లి, మురారి, హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు.

'పరువునష్టం కేసు వేస్తా'

పెద్దాపురం, జనవరి 9: తనపై రహదారుల భవనాలశాఖ ఈఈ చేసిన అసత్య ఆరోపణలను రుజువు చేయకపోతే ఆయనపై పరువునష్టం కేసు వేస్తానని కాంట్రాక్టర్ గణేసుల రాంబాబు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఈఈ వెంకటేశ్వరావుపై జరిగిన దాడికి సంబంధించి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దీనిని ఆయన తీవ్రంగా ఖండించారు.

'సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా'

తాళ్లరేవు, జనవరి 9: అంగన్‌వాడీల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పింఛన్లు పంపిణీ జరుగుతుండగా నిరసన తెలిపేందుకు అంగన్‌వాడీలు రాగా వైసీపీ కార్యకర్తలు, పోలీసులు అడ్డుకున్నారు. తరువాత ఎమ్మెల్యే దీక్షా శిబిరానికి వెళ్లి వారి వినతిని స్వీకరించారు.

అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

కొండెవరం (కొత్తపల్లి), జనవరి 9: విజయవాడలో ఈనెల 19న జరిగే సామాజిక సమత సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొండెవరం సర్పంచ్ వేమగిరి చెల్లాయ్యమ్మ, ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు కోరారు. కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి మునలయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ పి.వీరబాబు,దళితనేత వేమగిరి రాంబాబు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 9: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 మంది పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పుణ్యమంతుల నూకరాజు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పుణ్యమంతుల రవి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం కె.చినరామమూర్తి, తోపాటినూకరాజు, తోపాటి ఫణీంద్రకాసులు, పుణ్యమంతుల శివ పాల్గొన్నారు.

సర్పవరం ఎస్‌హెచ్‌వోగా శ్రీనివాస్

సర్పవరం జంక్షన్, జనవరి 9: కాకినాడ రూరల్ సర్పవరం పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ అధికారి (ఎస్‌హెచ్‌వో)గా వైఆర్‌కే.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

జిల్లా వైద్యశాఖాధికారి నరసింహనాయక్



అన్నవరంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖాధికారి

అన్నవరం, జనవరి 9: ప్రతిఒక్కరూ పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యకర సమాజం నెలకొల్పాలని జిల్లా వైద్యశాఖాధికారి జి.నరసింహనాయక్ పేర్కొన్నారు. మంగళవారం అన్నవరం దేవస్థానంలో సిబ్బందికి వాటిపై అవగాహన కల్పించారు. వాటి వినియోగం వల్ల క్యాన్సర్ వ్యాధితో పాటుగా వివాహం కాని వయస్సు వారు ఉపయోగిస్తే వారికి సంతానసమస్యలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌డి ప్రోగ్రాం అధికారి సత్యనారాయణ, ఈవో రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరం పరిశీలన

తొండంగి, జనవరి 9: ఏ.కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్యసురక్షా శిబిరాన్ని జిల్లా వైద్యశాఖాధికారి జి.నరసింహనాయక్ పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, భారతి నుంచి రోగులకు అందిస్తున్న సేవలపై ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. 406 మంది రోగుల్ని పరీక్షించి, వారిలో 234 మందికి రక్త పరీక్షలు జరిపామని, వారందరికి 92 రకాల మందులు ఉచితంగా అందించామన్నారు. సర్పంచ్ బెక్కం రాజావరలక్ష్మి చంద్రగిరి వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

'నూరుశాతం ప్రసవాలు జరిగేలా సేవలందించాలి'

కొత్తపల్లి, జనవరి 9: ప్రభుత్వాసుపత్రుల్లో నూరుశాతం ప్రసవాలు జరిగేలా సేవలందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కె.రత్నకుమార్ విజ్ఞప్తి చేశారు. నాగులాపల్లి, మూలపేటలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్ష కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు లక్ష్యాన్ని సాధించాలని ఆరోగ్యసిబ్బందికి సూచించారు. హెచ్ఈ కృష్ణారావు, జి.శ్రీనివాసరావు, షేక్ అహ్మద్‌ఆలీ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ రత్నాకరరావు రమణయ్యపేట పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అయేషా ఫాతిమా, డాక్టర్ మోనికారామ్, డాక్టర్ ఏ శ్రీప్రదీప్తి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కిట్లు, మందులను పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి దవులూరి వెంకట రమణ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

గిరిజన కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



మెట్టిచింతలో గిరిజనులతో సమావేశమైన నాయక్

ప్రత్తిపాడు, జనవరి 9: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ చెప్పారు. ప్రత్తిపాడు మండలం బురదకోట గ్రామ పంచాయతీ పరిధిలోని మెట్టిచింత, గోకవరం పంచాయతీ పరిధిలోని వంతాడ, గిరిజనాపురం గ్రామాలను మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, గృహ వసతి, విద్య, రహదారులు తదితర మౌలిక వసతుల సమస్యలను గిరిజనులు నాయక్ దృష్టికి తెచ్చారు. గిరిజనాపురంలో తమ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటున్నారని గిరిజనులు వాపోయారు. దీనిపై శంకర్‌నాయక్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గిరిజనులకు ప్రభుత్వ పరంగా అందుతున్న పథకాలపై ఆయన అధికారులతో సమీక్ష జరిపారు.గిరిజనులకు నూరుశాతం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కుల్రధ్రువీకరణ పత్రాలు జారీలో అలసత్వం వద్దన్నారు. గిరిజనులకు పక్కా గృహాలు, సీసీ రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగునీరు, చెక్‌డ్యాం ఇతర సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన గిరిజనా పురం గ్రామంలో బస చేసి బుధవారం కూడా పర్యటించనున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా గిరిజన సంక్షేమాధికారిని ఎ.విజయశాంతి, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ పుణ్యవతి, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, ఎంఈవో వి.రాజబాబు, ఏపీఎం ఇనగంటి వెంకట్రావు, ఏపీవో కుమారస్వామి, హౌసింగ్ ఏఈ అత్తిలి ప్రసాద్ పాల్గొన్నారు.

నాయక్‌కు సత్కారం

జేఎన్టీయూకే, జనవరి 9: జిల్లాలో 2రోజుల పాటు గిరిజన గ్రామాల పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య సోమ శంకర్‌నాయక్ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఆయన వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజును మర్యాదపూర్వకంగా వీసీ చాంబర్‌లో కలవగా ఉపకులపతి నాయక్‌ను సత్కరించారు. ఆయన వెంట వర్సిటీ బయో టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మాలోతు రమేష్, డీటీడబ్ల్యూవో వి.శాంతి ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, జనవరి 9: ఎన్నికల సమీపిస్తుండడంతో ఇప్పటివరకూ కనిపించని నాయకులందరూ ప్రజలపై ప్రేమ ఒలకబోస్తూ ఓటు కోసం వస్తున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. కొత్తపల్లి మండలం కొండెవరంలో గాది గోపితో పాటు అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు మంగళవారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి వర్మ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వర్మ మాట్లాడుతూ ఓడినా, గెలిచినా తాను ఎల్లప్పుడు కష్టసుఖాల్లో ప్రజలతోనే ఉన్నానని తెలిపారు. నాలుగున్నరేళ్లపాటు నియోజకవర్గాన్ని వదిలివేసిన నేతలు నేడు హరిదాసుల్లా ప్రజల ముందుకు వస్తున్నారని చెప్పారు. టీడీపీ పాలనలో కొండెవరం గ్రామాన్ని కోట్లాది రూపాయిలతో అభివృద్ధి చేశామని తెలిపారు. తాము తిరిగి అధికారంలోకి రాగానే గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ కొత్తపల్లి మండలశాఖ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, రాజబాబు, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ సేవలను స్మరించుకోవాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 9: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు పిలుపునిచ్చారు. విజయవాడలో ఈనెల 18న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జన్‌భాగిదారి కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఇతర అధికారులు, ఉద్యోగులు మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఇ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ ఎం.వెంకటరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్, అధికారులు ఉన్నారు.

'భోగి ఉత్సవాలు వైభవంగా చేపట్టాలి'

అన్నవరం, నవంబరు 9: అన్నవరం దేవస్థానంలో ప్రతీఏటా సంప్రదాయ బద్ధంగా నిర్వహించే భోగి ఉత్సవాలు ఈ ఏడాది వైభవంగా చేపట్టాలని ఈవో రామచంద్రమోహన్ సూచించారు. మంగళవారం ఏర్పాట్లు చేపట్టే వార్షిక కల్యాణ వేదిక వద్ద ఖాళీ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈనెల 14న ఈ వేడుకలు నిర్వహించనున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేవిధంగా భోగిమంటలు, కోడిపుంజులు, ఎడ్లబండి, ధాన్యపు రాసులు, గంగిరెద్దులు తదితర వాటిని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

పారిశుధ్య కార్మికుల వినూత్న నిరసన



ద్రాక్ష పండ్లు అందుకోవడానికి ప్రయత్నిస్తూ కార్మికుల నిరసన

పిఠాపురం, జనవరి 9: డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై పారిశుధ్య కార్మికులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. నిరవధిక సమ్మె చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరంలో డిమాండ్ల పరిష్కారం అందని ద్రాక్షగా ఉందంటూ ద్రాక్ష పండ్లు అందుకోవడానికి ప్రయత్నం చేసి చూపారు. ఆందోళనలో ఏఐటీయూసీ నాయకుడు రామకృష్ణ, కార్మిక యూనియన్ ప్రతినిధులు ముత్యాల అప్పారావు, చెక్కా అప్పలకొండ, లంకా ప్రసాద్, పొట్లూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబుష్యూరిటీ కరపత్రాల పంపిణీ

కిర్లంపూడి, జనవరి 9: బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను సోమవరంలో మంగళవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు మంచికంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. ఎస్.రాజేష్, బూత్ కమిటీ సభ్యులు అధ్యంపూడి శ్రీను, డి.వీరబాబు, ఎం.వీరబాబు ఉన్నారు.